## ‘గేమ్ చేంజర్’ సందడి



**రామ్‌చరణ్** నటిస్తున్న ‘గేమ్ చేంజర్’ డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. శంకర్ దర్శకత్వంలో అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. భారీ యాక్షన్ హంగులతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా గురించి ఆసక్తికరమైన పోస్ట్ చేశారు సంగీత దర్శకుడు తమన్. డిసెంబర్ 20న ‘గేమ్ చేంజర్’ ప్రేక్షకుల ముందుకొస్తున్నదని, ఇప్పటి నుంచి సినిమా రిలీజ్ వరకు వరుసగా అప్‌డేట్స్ ఉంటాయని తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. తమన్ ట్వీట్‌తో రామ్‌చరణ్ అభిమానులు ఖుషీ అవుతున్నారు. తాజా సమాచారం ప్రకారం బుధవారం రెండో పాటను విడుదల చేయబోతున్నారని తెలిసింది. ఈ చిత్రంలో రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: దిల్‌రాజు-శిరీష్, దర్శకత్వం: శంకర్.




## సిరిమల్లె పువ్వులాంటి సినిమా

‘ఇప్పుడంటే తెలుగు సినిమా భారీ తనానికి కేరాఫ్ అడ్రస్ అయ్యిందికానీ.. ఒకప్పుడు తెలుగు సినిమా అంటే కె.విశ్వనాథ్‌గారి సినిమాలు. పెద్ద వంశీగారి సినిమాలు. మనసుల్ని మెలిపెట్టే భావోద్వేగాలను వారి సినిమాల్లో చూశాం. అలాంటి సినిమాలు ఈ రోజుల్లో చేయడం కుదరదా అనుకుంటున్న టైమ్‌లో ‘96’ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ రాసుకున్న కథను చదివాను. ఆనందంతో కన్నీళ్లొచ్చాయి. అన్నయ్యకి ఈ స్క్రిప్ట్ ఇచ్చాను. ఆయన చదివి ఎమోషన్ అయ్యారు. ఇలాంటి కథలు నీకే ఎలా దొరుకుతాయి? అన్నారు. ఇందులో మరోముఖ్యమైన పాత్రను అరవింద్‌స్వామి చేశారు. కమల్‌హాసన్ స్థాయిలో నటించారాయన. ‘ఖైదీ’లా నైట్ షూట్ ఉండే కథ ఇది. డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ ప్లాన్డ్‌గా షూట్ చేశారు. ఇప్పటివరకూ చూడని కజిన్స్ ఎమోషన్‌తో తెరకెక్కిన కథ ఇది. మాకంటే ఒకరోజు ముందు బ్రదర్ తారక్ ‘దేవర’ రాబోతున్నది. కచ్చితంగా పెద్ద హిట్ అవుతుంది. ‘దేవర’ వార్ ఫైర్ లాంటి సినిమా. మనది సిరిమల్లె పువ్వులాంటి బ్యూటిఫుల్ సినిమా. మనసుపెట్టి చేశాం. తప్పకుండా అందరికీ నచ్చుతుంది.’ అని హీరో కార్తీ అన్నారు. కార్తీ, అరవింద్‌స్వామి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం ‘సత్యం సుందరం’. ‘96’ఫేం సి.ప్రేమ్‌కుమార్ దర్శకుడు. సూర్య, జ్యోతిక నిర్మాతలు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో కార్తీ మాట్లాడారు. ఈ సినిమా తనకెంతో ప్రత్యేమని, ఆర్య, జగడం సినిమాలకు దర్శకత్వశాఖలో పనిచేశానని, తన కెరీర్ టాలీవుడ్‌లోనే మొదలైందనీ దర్శకుడు ప్రేమ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. ఇంకా నటి శ్రీదివ్య, నిర్మాత సురేశ్‌బాబు, రచయిత రాకేందుమౌళిలతోపాటు అతిథులుగా విచ్చేసిన విశ్వక్‌సేన్, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కూడా మాట్లాడారు.

## అడుగు తడబడితే నీ వెనకాలే ఉంటానులే..



గోపీచంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం ‘విశ్వం’. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనెపూడి నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా అక్టోబర్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. మంగళవారం ‘మొండితల్లి పిల్ల నువ్వు’ అనే పాటను విడుదల చేశారు. చేతన్ భరద్వాజ్ స్వరపరచిన ఈ పాటను శ్రీహర్ష రచించారు. తల్లీకూతుళ్ల బంధాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. ‘అడుగే తడబడితే..ఇదిగో నీ వెనకే ఉంటానులే..చిన్నారి తల్లి...కలలో భయపడకు..ఎపుడూ నీ కునుకై ఉంటానులే చిన్నారి తల్లి..మొండితల్లి పిల్ల నువ్వు’ అంటూ ఎమోషనల్‌గా ఈ పాటను తీర్చిదిద్దారు. డాటర్ సెంటిమెంట్‌తో రూపొందించిన ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇదని, గోపీచంద్ పాత్ర గత చిత్రాలకు భిన్నంగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. కావ్య థాపర్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె.వి.గుహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, దర్శకత్వం: శ్రీను వైట్ల.



## సూపర్ నేచురల్ థ్రిల్లర్ ‘జటాధర’

సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ ‘జటాధర’. వెంకట్ కల్యాణ్ దర్శకుడు. సుధీర్ బాబు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. మంగళవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘శాస్త్రీయ, పౌరాణిక అంశాల కలబోతగా ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశాం. ఈ రెండు భిన్న ప్రపంచాలు తెరపై ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతాయి. అబ్బురపరిచే విజువల్స్‌తో ఈ సినిమాను రూపొందించబోతున్నాం’ అన్నారు. భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని నిర్మాతలు ప్రేరణ అరోరా, శివివన్ నారంగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ తెలిపారు.

## కాశీ నేపథ్య కథాంశం



శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం ‘లైఫ్’ (లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కిషోర్ రాఠీ, మహేష్ రాఠీ, ఏ.రామస్వామి నిర్మించారు. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు మాట్లాడుతూ ‘కొడుకు బాధ్యత చూసుకుంటూ తండ్రి పడే ఆరాటం, తండ్రి కోసం కొడుకు చేసే పోరాటమే ఈ సినిమా కథాంశం. కాశీ నేపథ్యంలో కథ నడుస్తుంది. ఈ సినిమాలో శివ తత్వాన్ని చూపించే ప్రయత్నం చేశాం. చక్కటి కుటుంబ కథా చిత్రంగా మెప్పిస్తుంది’ అన్నారు. దైవిక అంశాలతో పాటు తండ్రీకొడుకు మధ్య ఉండే బంధాన్ని ఈ సినిమా ఆవిష్కరిస్తుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతాన్నందించారు.

## సంక్రాంతి హంగామా?



హ్యాట్రిక్ హిట్స్ తర్వాత బాలయ్య నుంచి సినిమా రాలేదు. ప్రస్తుతం కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఆయన ఓ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు ‘వీరమాస్’ అనే టైటిల్ ప్రచారంలో ఉంది. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణం దాదాపు తుదిదశకు చేరుకున్నది. ఈ సినిమా విడుదల తేదీ విషయంలో ఇప్పటివరకూ క్లారిటీ లేదు. అయితే.. అందుతున్న తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారట. త్వరలోనే అధికారిక ప్రకటన కూడా రానున్నది వినికిడి. బాలకృష్ణ 109వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. సంక్రాంతి విజయాలు బాలయ్యకు కొత్తకాదు. ఈ సినిమా సంక్రాంతి రిలీజ్ ఖాయమైతే నందమూరి అభిమానుల్లో పండగే. ఊర్వశీ రౌతేలా, ఛాందినీ చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ విలన్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. థమన్ సంగీత దర్శకుడు.

## నా కల నెరవేరింది



**‘యానిమల్’** సినిమాతో ఒక్కసారిగా యువతలో క్రేజ్ సంపాదించుకుంది బాలీవుడ్ భామ త్రిప్తి డిమ్రీ. ప్రస్తుతం ఈ అమ్మడికి వరుసగా భారీ ఆఫర్లొస్తున్నాయి. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన ‘బ్యాడ్ న్యూజ్’ చిత్రం కూడా ఈ భామకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటించిన తాజా చిత్రం ‘విక్కీ విద్యా కా వో వాలా వీడియో’ చిత్రం అక్టోబర్ 11న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషనల్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఇప్పటివరకు తనకు సినిమాల్లో డ్యాన్స్ చేసే అవకాశం రాలేదని, ఈ సినిమాలో ‘మేరే మెహబూబ్’ అనే పాట ఆ లోటును తీర్చిందని ఆనందం వ్యక్తం చేసింది. ‘నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అయితే ఇప్పటివరకు ఒక్క సినిమాలో కూడా డ్యాన్స్ చేసే అవకాశం దక్కలేదు. ఈ విషయం చాలా బాధపెట్టేది. ‘విక్కీ విద్యా కా వో వాలా వీడియో’ చిత్రంలో నాపై పాట ఉందని తెలియగానే పట్టరాని సంతోషమేసింది. కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య ప్రోత్సాహంతో చాలా సులభంగా డ్యాన్స్ చేయగలిగాను. నేను తొలిసారి డ్యాన్స్ చేసిన ఈ పాట ఎప్పటికీ గుర్తుండిపోతుంది’ అని త్రిప్తి డిమ్రీ ఆనందం వ్యక్తం చేసింది.

## ఆ ఆలోచనలోంచి ఈ కథ పుట్టింది



‘డిఫరెంట్ జనరేషన్స్ నేపథ్యంలో సాగే సినిమా ‘స్వాగ్’. వంశవృక్షాన్ని ఆవిష్కరిస్తూ తయారు చేసిన స్క్రిప్ట్ ఇది. సింగా అనే కేరక్టర్ ప్రజెంట్ జనరేషన్. 90'sకి సంబంధించిన కేరక్టర్ ఉంటుంది. అలాగే 70'sకి సంబంధించిన కేరక్టర్ ఉంటుంది. ఇంకా ముందుకెళ్తే.. మూల పురుషుడికి చెందిన పాత్ర ఉంటుంది. ప్రతి జనరేషన్‌లోనూ శ్రీవిష్ణునే కనిపిస్తున్నారు. నాలుగు పాత్రలకూ సమ ప్రాధాన్యం ఉంటుంది. అచ్చ తెలుగు అంశాలతో, రూటెడ్ కల్చర్‌తో ఈ సినిమా సాగుతుంది.’ అని దర్శకుడు హసిత్ గోలి అన్నారు. శ్రీవిష్ణు హీరోగా ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘స్వాగ్’. రీతూవర్మ కథానాయిక. మీరాజాస్మిన్, దక్ష నాగర్కర్ కీలక పాత్రధారులు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా హసిత్ గోలి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ‘పితృస్వామ్య వ్యవస్థ, పురుషాధిక్యతలపై స్త్రీల పోరాటాలు, తద్వారా నెలకొన్న లింగ విబేధాలు తరతరాలుగా ఉన్నవే. ఇవి కాలగమనంలో ఎలా మారుతూ వచ్చాయి? వాటి ప్రస్తుత రూపమేంటి? అనే ఆలోచన లోంచి ఈ కథ పుట్టింది. పేర్ల, విషయంలో పాత్రల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. కథానుగుణంగా యయాతి, భవభూతి లాంటి పేర్లు వాడాం. కథ విషయం కన్‌ఫ్యూజన్ లేకుండా అందరికీ అర్థమయ్యేలా స్క్రీన్‌ప్లే రాసుకున్నాను. ఇందులో ఫన్‌కి ఢోకా ఉండదు. ఇంటర్వెల్ బ్లాక్ ఆశ్చర్యపోయేలా ఉంటుంది’ అని తెలిపారు హసిత్ గోలి. రీతూవర్మ, మీరా జాస్మిన్ పాత్రలు భిన్నంగా ఆసక్తికరంగా ఉంటాయని, వివేక్‌సాగర్ సంగీతం సినిమాకు ప్రధాన బలం అని హసిత్ గోలీ చెప్పారు.

## అగ్ర హీరోలు పారితోషికాలు తగ్గించుకోవాలి



అగ్ర హీరోలు భారీగా పారితోషికాలు డిమాండ్ చేయడం సినిమా విజయావకాశాలపై ప్రభావం చూపుతున్నదని తమిళ దర్శకుడు వెట్రిమారన్ అభిప్రాయపడ్డారు. రజనీకాంత్, విజయ్ వంటి అగ్ర హీరోల చిత్రాలకు ఓటీటీ సంస్థలు 120 కోట్లు చెల్లించి స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంటున్నాయని, దీనివల్ల సినీరంగంలో వ్యాపారపరమైన అంతరాలు పెరిగిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ‘డైరెక్టర్స్ అన్‌కట్’ పేరుతో ముంబయిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ‘అగ్ర హీరోల చిత్రాలకు 120 కోట్లు చెల్లిస్తాం అంటూ ఓటీటీ సంస్థలు తొలుత ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దాంతో సినిమాల బడ్జెట్‌లు పెరిగిపోతున్నాయి. ఓటీటీ మార్కెట్‌ను చూసి అగ్ర హీరోలు రెమ్యునరేషన్ కూడా పెంచుతున్నారు. ఆ తర్వాత ఓటీటీ సంస్థలు ‘మేము ఆ స్థాయిలో చెల్లించలేం’ అంటూ చేతులెత్తేస్తున్నారు. అప్పటికే హీరోలతో రెమ్యునరేషన్ అగ్రిమెంట్స్ పూర్తయి ఉండటంతో నిర్మాతలపై భారం పడుతున్నది. ఓటీటీ సంస్థలు ఈ ధోరణిని మార్చుకోవాలి’ అని వెట్రిమారన్ అన్నారు.

## భయాన్ని గౌరవించాలని చెప్పడమే ‘దేవర’ కథ

**99శాతం సక్సెస్ రేట్ ఉన్న దర్శకుడు కొరటాల శివ. రచయితగా కెరీర్ మొదలుపెట్టి, దర్శకుడిగా మారి, వరుస విజయాలను అందుకొని టాలీవుడ్ టాప్ దర్శకుల్లో ఒకరిగా నిలిచారు కొరటాల. బ్లాక్‌బాస్టర్ ‘జనతా గ్యారేజ్’ తర్వాత ఎన్టీఆర్‌తో ఆయన చేసిన సినిమా ‘దేవర’. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె రెండు భాగాలుగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తొలిభాగం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో కొరటాల శివ విలేకరులతో ముచ్చటించారు.**



- రెండ్రోజుల్లో ‘దేవర’ రిలీజ్ కాబోతున్నది. పరీక్ష రాసి, ఫలితాలకోసం ఎదురుచూసే విద్యార్థి మానసిక పరిస్థితి ఎలావుంటుందో ప్రస్తుతం నా మానసిక పరిస్థితీ అలాగే ఉంది. ఈ ఫీల్ నా ప్రతి సినిమా రిలీజ్‌కూ ఉండేదే. జవాబుదారీతనం వల్లే వచ్చే భయం ఇది. ఈ భయం వల్లే మనం చేసే పనిని చెక్ చేసుకొని మంచి ఫలితాలు పొందుతాం.
- ‘దేవర’ సినిమా కూడా భయం చుట్టూనే తిరుగుతుంది. ప్రతి ఒక్కరిలో భయం కామన్. దాన్ని గౌరవించాలని చెప్పడమే ‘దేవర’ కథ. భయం లేకుండా బతకాలనుకోవడం తప్పు. మితిమీరిన ధైర్యం మూర్ఖత్వం అవుతుంది. లా ఆఫ్ ల్యాండ్ అనేది ఒకటి ఉంటుంది. దాన్ని అందరూ పాటించాలి. అదే భయం అంటే. ట్రాఫిక్ సిగ్నల్ పడుతుంది. అందరం ఆగుతాం. ఎందుకు ఆగాలి? వెళ్లిపోవచ్చుగా? మనలో బాధ్యతతో కూడిన చిన్నపాటి భయం ఉంటుంది. అది మనల్ని ముందుకు వెళ్లనివ్వదు.. ఆపేస్తుంది. ఆ భయం మనిషికి అవసరం. మంచిది కూడా. అదే ‘దేవర’లో చెప్పా.
- ‘దేవర’ను సెట్స్ పైకి తీసుకెళ్లడానికి ఆరు నెలలు టైమ్ తీసుకున్నాం. సముద్రంపై ఎలా షూట్ చేయాలి?.. కుదరకపోతే సముద్రాన్ని ఎలా క్రియేట్ చేసుకోవాలి?.. ఇలాంటి విషయాలపై స్టడీ చేశాం. ఈ తరహా సినిమాలు ఇప్పటివరకూ ఎవరూ చేయలేదు. దాంతో మాకు సలహాలిచ్చే వాళ్లు కూడా లేరు. అందుకే.. అన్ని విషయాలపై అవగాహన పెంచుకొని సినిమా మొదలుపెట్టాం.
- ఎన్టీఆర్‌తో ప్రయాణం నాకెప్పుడూ ప్రత్యేకమే. ఏ విషయమైనా ఆయనతో డిస్కస్ చేసినప్పుడు మనసులోని భావాన్ని నిర్మొహమాటంగా చెప్పేస్తారు. లోపల ఒకటి పెట్టుకొని బయటకు మరొకటి చెప్పే తత్వం కాదు తనది. ‘దేవర’ లైన్ చెప్పినప్పుడు ఆయన స్పందించిన తీరుతోనే ఈ సినిమా నెక్స్ట్ లెవల్‌కి వెళ్లింది. ఎన్టీఆర్‌కోసం మా టీమ్ అందరం చివరి నిమిషం వరకూ ఎంత ఎఫర్ట్ పెట్టాలో అంతా ఎఫర్ట్ పెట్టాం. ఇందులో తారక్ ద్విపాత్రాభినయం చేశారు. ఈ కథ రాసుకున్నప్పుడే రెండు పాత్రలకు తారక్ అనుకునే రాసుకున్నాను. తండ్రి ‘దేవర’.. కొడుకు ‘వర’. తండ్రి పాత్రను మించేలా కొడుకు పాత్ర ఉంటుంది. అలాగే జాన్వీకపూర్, సైఫ్ ఆలీ ఖాన్ తమ పాత్రలను అర్థం చేసుకొని అద్భుతంగా నటించారు. వాళ్ల గెటప్స్ విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం.
- ‘దేవర’ నరేషన్ నాలుగు గంటలుంది. పేపర్ మీద పెట్టినప్పుడు 6-7 గంటలు వస్తున్నది. సెకండ్ షెడ్యూల్ టైమ్‌లోనే ఈ కథను మూడు గంటల్లో చెప్పలేమని అర్థమైంది. దాంతో రెండు భాగాల్లో చేయాలని నిర్ణయించాం. ఇది బిజినెస్ కోసమో, సెన్సేషన్ కోసమో చేసింది కాదు. లక్కీగా ‘దేవర’కు సాబు శిరిల్, రత్నవేలు, శ్రీకరప్రసాద్, అనిరుథ్ లాంటి లెజెండరీ టెక్నీషియన్స్ కుదిరారు. వారిలో ఎవరికీ స్పూన్ ఫీడింగ్ ఇవ్వాల్సిన పనిలేదు. అర్థం చేసుకొని అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చారు. మొత్తంగా ‘దేవర’ ప్రేక్షకులందరికీ కన్నుల పండుగలా ఉంటుందని నమ్మకంతో చెప్పగలను.

